క్లుప్తంగా

రహదారుల అభివృద్ధికి పక్కా ప్రణాళిక



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న రమణ

విశాఖ విద్య: 90వ వార్డులోని అన్ని కాలనీల్లో రహదారుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేశామని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ ఈబీ కాలనీలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు ఆధునీకరణ పనులకు మంగళవారం జీవీఎంసీ ఈఈ రత్నాకర్, ఏఈ వెంకటలక్ష్మి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. రహదారి ఆధునీకరణకు రూ.19.90 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వార్డు టీడీపీ అధ్యక్షుడు ప్రసాద్, కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, విల్లా సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: నియోజకవర్గ పరిధిలోని పలు వార్డులోని దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లక్ష్మణరావును నిర్వాహకులు సత్కరించారు.

యారాడ రోడ్డు పనుల పరిశీలన



యారాడ ఘాట్‌రోడ్‌లో తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా : ఏళ్లనాటి యారాడ ఘాట్ రోడ్ సమస్య 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చొరవతో పరిష్కారమవుతుండడంతో అటు యారాడ గ్రామస్తులు, ఇటు పర్యాటకులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సుమారు రూ. 3.50 కోట్ల జీవీఎంసీ నిధులతో యారాడ ఘాట్‌రోడ్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేయాల్సిందే



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేయాల్సిందేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1,335వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామని, వంద శాతం రివైవల్ ప్యాకేజీ ప్రకటించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక కొరత.. కూడుకు వెత



ఎన్‌ఏడీ జంక్షన్‌లో కూలి పనుల కోసం వేచి ఉన్న కూలీలు

- పనులు లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న కూలీలు
- ఉచితం పోయి నరకం కనిపిస్తోందని వాపోతున్న కార్మికులు

గోపాలపట్నం: ఇసుక కొరతతో రోజువారీ కూలీలకు పస్తులు తప్పడం లేదు. ఈ మూడు నెలల్లో కనీసం 10 రోజులు కూడా కూలీ దొరకని పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. నియోజకవర్గంలో సుమారు లక్షా ఏభై వేల మంది భవన నిర్మాణాలపై ఆధారపడి జీవించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో దళారుల ఇష్టారాజ్యంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. ఇప్పుడు టన్ను ఇసుక ధర రూ. 1000 నుంచి రూ.2000కు చేరింది. దీంతో ఇంత రేటుతో కొని కట్టడం భారంగా మారడంతో భవన నిర్మాణదారులు పనులు నిలిపివేశారు. ఈ ప్రభావం రోజువారీ కూలీలపై పడింది. ఎన్‌ఏడీ జంక్షన్‌లో రోజువారీ పని కోసం సుమారు 500 మంది కూలీలు, మేస్త్రులు వేచి చూస్తుంటారు. మట్టి పనికి, సిమెంట్ పనికి, మేస్త్రీ పనులకు ఇక్కడ పనివారు దొరుకుతుంటారు. అంతే కాకుండా బాజీజంక్షన్, గోపాలపట్నం, కొత్తపాలెం ఇలా పలు సెంటర్లలో కూడా రోజువారీ కూలీలు పనుల కోసం వేచి ఉంటారు. ఇక్కడికి ఏదైన ద్విచక్ర వాహనం గాని ఆటో గాని వచ్చి ఆగితే చాలు అంతా ఒక్కసారిగా ఆశగా గుమిగూడుతారు. ఏదైనా పని దొరుకుతుందా అని ఆశపడతారు. ఉదయం 6 గంటల నుంచి విశాఖ శివారు ప్రాంతాల నుంచి, విజయనగరం జిల్లా నుంచి కూడా వస్తుంటారు. రవాణా ఖర్చులే తమకు రోజుకు రూ. 150 నుంచి రూ. 250 వరకు అవుతుందని వీరు చెబుతున్నారు. పని దొరికితే ఇబ్బంది లేదు. లేకపోతే ఈ ఖర్చులు అదనపు భారమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజూ కాకపోయినా నెలలో కనీసం సగం కంటే ఎక్కువ రోజులు పని దొరికేదని చెబుతున్నారు. పల్లెల్లో పనులు లేక నగరాల్లోకి వస్తే ఇసుక కొరత వల్ల ఇప్పుడు అది కూడా దక్కడం లేదని వాపోతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంత ఇబ్బంది పడలేదని చెబుతున్నారు. ఇసుకపై సరైన నిర్ణయం తీసుకోకపోతే కూలీలు పస్తులతో చావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు సంపాదించిన కూలీ నాలుగు రోజులు తిరిగేసరికి ఖర్చయిపోతుందని, ఇంట్లో గడిచేదెలా అని వాపోతున్నారు. ఇసుక దొరక్క అధిక ధరలకు కొనుగోలు చేయలేక భవన నిర్మాణారులు పనులు నిలిపేస్తున్నారని, దీంతో తమకు ఈ పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం వరకు ఎదురు చూసి నిరాశతో వెనుదిరగాల్సి వస్తుందంటున్నారు. ప్రభుత్వం ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలని, ఉచిత ఇసుక త్వరగా అందివ్వాలని కోరుతున్నారు.



పనుల కోసం వేచి ఉన్న కూలీలు

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం



ఇసుక కొరత వల్ల పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాము. వారానికి ఒక రోజు కూడా పని దొరకడం లేదు. కుటుంబాన్ని పోషించేందుకే ఇబ్బందిగా ఉంది. ఈ పనుల కోసమే ఇక్కడికి వచ్చి స్థిరపడ్డాం. గతంలో బాగుండేది. రోజూ పని దొరికేది. మూడు నాలుగు నెలలుగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం న్యాయం చేయాలి

– ఎ. రామారావు, బుచ్చిరాజుపాలెం

ఇసుక ధర భారీగా పెరిగింది..



ఇసుక ధర ఎప్పుడూ లేని విధంగా పెరిగిపోయింది. నిర్మాణాలు జరగడంలేదు. ఈ పనుల మీదే ఆధారపడి ఉన్నాం. భర్త లేడు. పిల్లలకు నేనే ఆధారం. మూడు నెలల్లో 10 రోజులైనా పని దొరక లేదు. పూట గడవడం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎం. నర్సమ్మ, బాజీ జంక్షన్

ఇంత దారుణం ఎప్పుడూ లేదు..



ఇంత దారుణం ఎప్పుడూ లేదు. రోజుకు 200 మందికి పని కల్పించే వాడిని. ఇప్పుడు 50 మందికి కూడా పని ఇప్పించలేకపోతున్నాను. నన్ను నమ్ముకుని ఎంతో మంది ఉన్నారు. వారికి ఉపాధి కల్పించలేక చాలా ఇబ్బంది పడుతున్నాను. ఇసుక సమస్య ఎపుడు తీరుతుందో మాలాంటి వారి పరిస్థితి ఎప్పుడు బాగు పడుతుందో తెలియడంలేదు.

– వెంకటరావు, లేబర్ మేస్త్రి

ఫ్లైఓవర్ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలి

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



ఫ్లైఓవర్ కింద ఫౌంటెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్, డిప్యూటీ మేయర్ శ్రీధర్



గాంధీనగర్ ఏరియాను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్, డిప్యూటీ మేయర్ శ్రీధర్

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: విశాఖ నగరానికి స్వాగత ద్వారంగా ఉన్న ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పార్కు కళ తప్పుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ నెల 6న 'పట్టించుకునే వారేరీ..?' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాలు, అదేవిధంగా ఫ్లై ఓవర్ పార్కును ఆయన పరిశీలించారు. బిర్లా జంక్షన్ వైపు ఉన్న బస్ స్టాప్ మొదలు కొని ఎయిర్ పోర్టు వైపు పరిసర ప్రాంతాలలో ఈ పర్యటన కొనసాగింది. ఫ్లైఓవర్ కింద పార్కును ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిరుపయోగంగా ఉన్న ఫౌంటెయిన్‌కు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఫ్లైఓవర్ పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. ఈ సందర్భంగా చాలా కాలంగా ప్రధాన సమస్యగా ఉన్న ఫ్లైఓవర్ కు ఆనుకొని ఉన్న యునైటెడ్ క్రైస్ట్ చర్చి పక్క నుంచి గాంధీనగర్‌ను అనుసంధానం చేసేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని అంశాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీన్ని నిర్మించాల్సిన అవసరాన్ని వివరించారు. నిరుపయోగంగా ఉన్న ఫౌంటెయిన్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు. ఫౌంటెయిన్ వినియోగంలో ఉన్నట్టయితే దీన్ని చూసేందుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పర్యటనలో వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు. అంతకుముందు కాకానినగర్ వైపు జరుగుతున్న ఆర్‌వోబీ పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

రహదారిపైనే స్కూల్ బస్సుల పార్కింగ్



రహదారిపై నిలిపిన ప్రైవేటు స్కూల్ బస్సులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలో రహదారిపైనే ప్రైవేటు స్కూల్ బస్సులను ప్యార్కింగ్ చేస్తున్నారు. రోజుల తరబడి ఇలానే పార్కింగ్ చేసి ఉంచటంతో ఆ దారిలో వెళ్లే ఇతర వాహనాల ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. వుడా లే అవుట్ గ్రీన్ బెల్ట్ పార్కుకు అనుకొని రహదారిపై బస్సులను పార్కింగ్ చేయటం వల్ల పార్కుకు వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం పార్కుకు వచ్చే వారు, తమ వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు స్కూల్ బస్సులను రోడ్డుపై పార్కింగ్ చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రైవేటు స్కూళ్ల బస్సులను వారికి సంబంధించి స్థలాల్లోనే పార్కింగ్ చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గ్రీన్ బెల్ట్ ఆక్రమణల తొలగింపు



గ్రీన్ బెల్ట్ లో వేసిన కాంక్రీట్‌ను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..



కాంక్రీట్ పూర్తిగా తొలగించిన దృశ్యం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కాకాని నగర్ వద్ద గ్రీన్ బెల్ట్ ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. జాతీయ రహదారికి ఆనుకొని కాకానినగర్ ట్రాఫిక్ సిగ్నల్‌కు సమీపంలో గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. గ్రీన్ బెల్ట్ రక్షణ కోసమని జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంచెను కూడా తొలగించిన, ఆక్రమణదారులు అక్కడ దర్జాగా సిమెంట్ కాంక్రీట్‌తో పటిష్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. సుమారు 60 గజాల గ్రీన్ బెల్ట్ స్థలం ఆక్రమణకు గురైనా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. కూటమి నేతల కనుసన్నల్లో ఈ ఆక్రమణలు జరుగుతుండడతో అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనిలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ప్రచారం సాగింది. ఈ మొత్తం వ్యవహారంపై 'గ్రీన్‌బెల్ట్ ఆక్రమణ' శీర్షికన ఈ నెల 7వ తేదీన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. జీవీఎంసీ జోన్–8 కమిషనర్ హైమావతి ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారి తేజ స్థానిక సచివాలయం సిబ్బందితో ఆక్రమిత ప్రదేశానికి చేరుకొని, గ్రీన్ బెల్ట్ ఏరియాలో వేసిన కాంక్రీట్‌ను తొలగించారు.

డాక్‌యార్డ్ వర్క్స్ కమిటీ విజేతలకు అభినందన



సన్మానిస్తున్న అసిసోయేషన్ ప్రతినిధులు

విశాఖ విద్య: నేవల్ డాక్ యార్డ్ వర్క్స్ కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేటీబీ అసోసియేషన్ తరపున విజయం సాధించిన రెడ్డిపల్లి యోగిత, ముత్తిరెడ్డి శ్రీనివాస్, నిమ్మదల జగదీష్‌లను మంగళవారం కాకానినగర్‌లో ఉన్న ఈస్టర్న్ నేవల్ కమాండ్ (నేవల్ డాక్ యార్డు) కేటీబీ కళాక్షేత్రంలో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే ముగ్గురు అభ్యర్థులను గెలిపించుకోవడం జరిగిందన్నారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ (నేవల్ డాక్ యార్డ్) కేటీబీ అసోసియేషన్ నిరంతరం అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్, జి.శ్రీనివాస్, ఆర్.రామకృష్ణ ఆర్.శ్రీనివాస్, వి.వెంకటేష్, పి.రవికుమార్, జి.మహేష్, ఎం.ఎస్.అప్పారావు తోపాటు అధిక సంఖ్యలో డాక్ యార్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు



జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : నిబద్ధతతో పని చేసే అధికారులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవోగా, సీఈ వో (ఇన్‌చార్జి)గా పనిచేసి శ్రీకాకుళం బదిలీ అయిన డి.సత్యనారాయణ వీడ్కోలు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్ల క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి బదిలీపై ఆయన శ్రీకాకుళం జిల్లాకు వెళ్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను సుభద్ర సత్కరించారు. రెండేళ్లలో తనకు అన్ని విధాల సహకరించిన సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతుల్లో, బదిలీల్లో, కారుణ్య నియామకాల్లో నిబంధనలకు లోబడి పని చేయడం సంతోషం కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా డీపీవో శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘం నాయకులు మూర్తి, త్రినాథ్, మధు, రాధ, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : సెంటర్ ఫర్ సైకాలజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ మ్యూజిక్ థెరపీ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న విద్యార్థులు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం కచేరీ నిర్వహించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న త్యాగరాజ, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి కృతులను మృదు మధురమైన కంఠంతో ఆలపించి అలరించారు.

జగన్మాతా... దుర్గమ్మా



మార్కెట్ వీధిలో దుర్గమ్మ



గొల్లవీధిలో మహాలక్ష్మీ అవతారంలో..



మహాలక్ష్మీ అలంకరణలో దుర్గాలమ్మ వారు



90వ వార్డు సాయిమందిరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తపాలెం కరెన్సీ నోట్లతో విజయదుర్గా దేవికి అలంకరణ



బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలో భక్తులు



అమ్మవారికి సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే గణబాబు



కార్పొరేటర్ గల్లా చిన్నాను సత్కరిస్తున్న ఆటోస్టాండ్ యూనియన్ సభ్యులు

విశాఖ విద్య: దసరా ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. దుర్గమ్మ వారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 52,90వ వార్డుల పరిధిలో కరాస, శాంతినగర్ అదే విధంగా బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, కాకానినగర్, గవర వీధి వంటి చోట్ల ప్రత్యేక మండపాలపై కొలువుదీరిన జగన్మాతకు పూజలందించేందుకు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ–బంగారమ్మ వారు భక్తులకు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన అమ్మ వారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మహాలక్ష్మిదేవి అవతారంలో..

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్ వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గమ్మతల్లి మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. దుర్గమ్మతల్లి పీఠం చుట్టూ కరెన్సీతో తోరణాలు మాదిరిగా అలంకరించారు. అమ్మవారి ఇష్టమైన పిండి వంటలు,పండ్లను సారే రూపంలో ప్రకాష్‌నగర్ నుంచి అమ్మవారి పీఠం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఇదే వీధిలో డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు మజ్జి సోమేష్ దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలను చేశారు. అలాగే మల్కాపురం, మార్కెట్‌వీధిలోని దుర్గాదేవి ఆలయంలో కొలువుదీరిన దుర్గమ్మను మహాలక్ష్మి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల విజయదుర్గా ఆలయంలో దుర్గాదేవి పూజలు ఘనంగా జరిగాయి.

63వ వార్డులో

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీ శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా వార్డు పరిధిలోని జైఆంధ్రాకాలనీ ఆటోస్టాండ్ యూనియన్ సభ్యులు నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు గల్లా చిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యూనియన్ సభ్యులు కార్పొరేటర్ గల్లా చిన్నాను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గూడెల కృష్ణ, జె.త్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, బాబూరావు, కనక పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు

గోపాలపట్నం: దేవీశరన్నవరాత్రులు సందర్భంగా కొత్తపాలెం విజయదుర్గా అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

● టమాటా కోసం భారీ క్యూ



టమాటా ధరలను నియంత్రించడానికి మార్కెటింగ్ శాఖ రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయాలు ప్రారంభించింది. ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం కిలో రూ.50 చొప్పున విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.70, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80 ధర పలుకుతోంది. అయితే రైతుబజార్లలో విక్రయిస్తున్న టమాటాల నాణ్యత బాగోలేదని కొనుగోలుదారులు అంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం